క్లుప్తంగా

9న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పట్టాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: వచ్చే నెల 9న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పట్టాన్ షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించటం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్ రావు మాట్లాడుతూ రాజీపడదగిన కేసుల్లో పోలీసు అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవటం ద్వారా అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. స్నేహ పూర్వక వాతావరణంలో కేసులు పరిష్కరించడం శ్రేయస్కరమన్నారు.

గుల్లేపల్లిలో 167 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం గుల్లేపల్లిలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 167 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట




ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. తామరంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సాగిన ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి

మాకవరపాలెం: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ బిక్కవోలు ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం అనకాపల్లిలో నిర్వహించే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని మాదిగలంతా పాల్గొనాలని కోరారు.

వారపు సంత వేలం రూ.2.77 లక్షలకు ఖరారు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మాకవరపాలెం: వారపు సంత వేలం రూ.2,77,500 లకు ఖరారైంది. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలోని దుకాణాల వద్ద ఆశీలు వసూలుకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో వివిధ ప్రాంతాల నుంచి 15 మంది వేలందారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలంలో కొంకోట మండల తాళ్లపాలెం గ్రామానికి చెందిన గల్లా సన్యాసినాయుడు రూ.2,77,500 లకు వేలం దక్కించుకున్నాడు. గతేడాది వేలం ద్వారా రూ.2.68 లక్షల ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్ లింకన్ తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

సిమెంటు బెంచీ వితరణ

రోలుగుంట: కొమరవోలు గ్రామానికి చెందిన పరదేశమ్మ ఆలయానికి బుచ్చింపేట వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ భక్తులు సౌకర్యార్థం సిమెంటు బెంచీని శనివారం ఏర్పాటు చేశారు. ఆలయం కమిటీ అతనికి కృతజ్ఞతలు తెలియజేసింది. రమణ ఇప్పటికే తన స్వగ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పన, రజకులు, మేదర కులాల్లో పేదలకు ఆర్థిక సాయం అందించారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

అంగరంగ వైభవంగా విగ్రహాల ఆవిష్కరణ



దేశనాయకులు వేషధారణలు ధరించిన చిన్నారులతో ఎమ్మెల్యే గణేష్



గాంధీజీ విగ్రహావిష్కరణ

- నర్సీపట్నం రోడ్లులో 13 మహనీయుల విగ్రహాల ఏర్పాటు
- అలరించిన కోలాటాల ప్రదర్శన
- మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే గణేష్



స్వామి వివేకానంద విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గణేష్, తదితరులు

నర్సీపట్నం: మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపుతో విగ్రహాల ఆవిష్కరణకు వేలాది మంది తరలి రావడంతో జాతరను తలపించింది. పెదబొడ్డేపల్లి మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేసిన నూతన కూడలి నుంచి డప్పువాయిద్యాలు, చిడతలు, కోలాటాల నడుమ వేలాది మందితో విగ్రహాల ఆవిష్కరణ ప్రదేశానికి చేరుకున్నారు. తొలుత నూతన రోడ్డుకు ఇరువైపులా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో వేలాది మొక్కలు నాటుతూ ముందుకు సాగారు. అనంతరం సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఝాన్సీలక్ష్మీబాయ్, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, మదర్ థెరిసా, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు, అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, స్వామి వివేకానంద, జ్యోతిబాపూలేల విగ్రహాలను వివిధ సంఘాల ప్రతినిధులతో ఆవిష్కరింపజేశారు. ప్రధానంగా దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు ప్రత్యేకంగా అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రూ.6 కోట్లతో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించామన్నారు. అందరి సహకారంతో రోడ్డు విస్తరణ 70 శాతం పూర్తి చేశామన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యను అధిక మించడంతోపాటు ప్రజలు సులువుగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో మరింత సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. పిలవగానే ఆవిష్కరణ మహోత్సవానికి తరలివచ్చిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ అందించాలని, నిరంతరం ప్రజా సేవకే అంకితం అవుతానన్నారు. రోడ్డు విస్తరణ అడ్డంకులు తొలగింపునకు కృషి చేసిన వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, విజయ్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, మణికుమారి సాగిన లక్ష్మణమూర్తి, రుత్తల సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, రుత్తల శ్రీనువాసరావు, నాగేశ్వరరావు, యక్కల సత్యనారాయణ, పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైటరీ, లయన్ క్లబ్ ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వేడుకగా గిరి ప్రదక్షిణ

తాండవ నల్లకొండమ్మ తల్లి ప్రాంగణంలో భక్తుల కోలాహలం



గిరి ప్రదక్షిణలో భక్తుల కోలాహలం

నాతవరం: తాండవ ప్రాజెక్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ప్రాంగణంలో శనివారం గిరి ప్రదక్షిణలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రాంతీయులు ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలగా పూర్తవుతుందన్న అపార నమ్మకం. దీంతో కొంత కాలంగా ఏటా ఫిబ్రవరిలో గిరిప్రదక్షిణ చేస్తుంటారు. ఈ ఏడాదీ మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శనివారం ఉదయం 9 గంటల నుంచి తాండవ, అడాకులు, తాండవ ప్రాజెక్టు స్పిల్ వే గేట్లు, జాలారిపేట గ్రామం మీదుగా గిరి ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళల కోలాటం, భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరి ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక సిద్ధి వినాయక స్వామి వారి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది స్వామివారిని పూల దండలతో అలంకరించారు. ఎంతో విశిష్టత కలిగిన స్వామి వారిని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులతోపాటు భోగాపురం, కొవ్వూరు, కొండపాలెం, కొత్తకోట తదితర గ్రామాల భక్తులు అధికంగా తరలి వచ్చి దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను కమిటీ చేసింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పింఛన్ కోసం దరఖాస్తు చేయండి

జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూరి అప్పారావు

రావికమతం: మండలంలో 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులంతా పింఛన్ కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు తెలిపారు. శనివారం రావికమతంలో మండల చేనేత సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో అర్హులైన చేనేత కార్మికులందరికీ పింఛన్ వచ్చేలా చూడాలని మండల చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి దొడ్డి సురేష్, పప్పు వెంకటరమణ తదితరులు ఆయన దృష్టికి తీసుకురాగా, పై విధంగా స్పందించారు. దీంతోపాటు చేనేత కార్మికుల సమస్యలను కార్పొరేషన్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.


విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న వైస్ ఎంపీపీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం విద్యార్థులకు ఉన్నత విద్య కోసం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ గొంప చినబాబు తెలిపారు. రెండో విడతలో మంజూరైన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు శనివారం ఆయన సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యంతో కలిసి పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కార్పొరేటుకు దీటుగా పేద పిల్లలకు ఉన్నత విద్య అందించాలని నాడు–నేడు నిధులతో సర్కారు పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి విద్యా బోధన సాగాలని, ఉపాధ్యాయులు పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. హెచ్ఎం సత్యారావు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



దుర్గాలమ్మ అమ్మవారు



నీలకంఠాపురంలో నిర్మించిన అమ్మవారి ఆలయం

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులతోపాటు పలువురి దాతల విరాళాలతో గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో కొత్తగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా ప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, పలువురు నాయకులు హాజరు కానున్నారని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సర్పంచ్ పడాల నాగభూషణం, వైస్ సర్పంచ్ పడాల వెంకటరమణ గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

27న మోదకొండమ్మ తీర్థం



మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం ఈ నెల 27న జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు శనివారం తెలిపారు. ఈ తీర్థాన్ని వైభవంగా నిర్వహించడానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబరు దంగేటి సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ అక్రమాల్లో రూ.12,500 రికవరీకి ఆదేశం



మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ రోజారాణి

నాతవరం: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే అధికారుల నుంచి రికవరీ చేస్తామని సంబంధిత అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు ఎం.రోజారాణి హెచ్చరించారు. మండల వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు 15 కోట్లు 55 లక్షల 44 వేల 550 రూపాయలతో చేసిన 1,068 పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేశారు. వీటిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక 16వ రౌండు అవుతుందన్నారు. ఇంతవరకు నిర్వహించిన 22 మండలాలతో పోల్చుకుంటే, నాతవరం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలనలో పెద్దగా అక్రమాలు జరగలేదన్నారు. రూ.12,500 రికవరీకి ఆదేశించామన్నారు. పలు పంచాయతీల్లో పనులు చేసి రికార్డులు నమోదు చేయడంలో జాప్యం కారణంగా చిన్నపాటి పొరపాట్లు దొర్లాయన్నారు. గతంతో పోల్చుకుంటే ఉపాధి సిబ్బంది బాధ్యతాయుతంగా పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారి నిర్మలాదేవి, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో జాగరవు రాంబాబు, వైస్ ఎంపీపీ పైనం శ్రీనాగగోపి, ఏపీవో చిన్నారావు, డీఆర్పీ బి.సూర్యనారాయణ, గునుపూడి, మాధవనగరం సర్పంచులు వేముల సూర్యనారాయణ, సోమల చింతల్లి, గునుపూడి ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణ, ఈసీ దేముడు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కొటౌట : మండలంలోని రెండు గ్రామాల్లో మద్యం సీసాలు తరలిస్తుండగా ఆకస్మికంగా దాడి చేసి పట్టుకుని శనివారం ఇద్దర్ని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. నూతలగుంటపాలేనికి చెందిన పి.అప్పారావు 11 బ్రాండీ మద్యం క్వార్టర్ సీసాలు, వల్లవు సోమవరం గ్రామానికి చెందిన రాయుడు సంతోష్ 12 మద్యం సీసాలు తమ గ్రామాల్లో అక్రమంగా విక్రయించడానికి తరలిస్తుండగా మాటు వేసి పట్టుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. సెక్టార్ అధికారులతో శనివారం ఆయన తన కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎవరికీ అప్పగించిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నియమావళికి లోబడి పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలు స్వచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ బి.వెంకటరామయ్య, నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

విశాఖ తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



దేవరాపల్లి నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ నాయకులు



కె.కోటపాడు నుంచి పయనమైన ఎంపీపీ జగన్‌మోహన్, సర్పంచ్, ఎంపీటీసీలు


దేవరాపల్లి: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా విశాఖపట్నం వచ్చిన వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపు మేరకు ఆయన ఆధ్వర్యంలో భారీగా కార్లలో విమానాశ్రయానికి తరలివెళ్లి ఘన స్వాగతం పలికారు. వెళ్లిన వారిలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి మూరినాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, ఉగ్రాకుల అప్పారావు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శరారినాయుడు, రొంగలి వెంకటరావు, చింతల సత్య వెంకటరమణ, ఎంపీటీసీ ముల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలో పార్టీ నాయకులు విశాఖ నగరం యండాడలోని పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మాడుగుల నుంచి ఎం. కోడూరు, వి.వి.అగ్రహారం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొల్లవిల్లి రాజేష్, కోరుకొండ చెల్లంనాయుడు, నాయకులు పడాల అప్పలనాయుడు, కాలింగ కల్యాణరాజు, సుంకర శ్రీను, బొమ్మిశెట్టి శ్రీను, ఎంపీపీ రాజారామ్, పార్టీ మండల అధ్యక్షుడు పెదబాబు, తదితరులు బయలుదేరి వెళ్లారు.

కె.కోటపాడు: రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా విశాఖ విచ్చేసిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు శనివారం కె.కోటపాడు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు వెళ్లారు. కార్లలో ర్యాలీగా విశాఖ విమానాశ్రయానికి చేరుకుని ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, వేచలపు దొరబాబు, గొంద్రుపోటు వెంకటరావు, ఆదిరెడ్డి రామునాయుడు, శ్రీకాంత్ శ్రీను, ఆదిరెడ్డి వెంకటరావు తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

ఉమామహేశ్వరి దేవి తీర్థ మహోత్సవానికి సర్వం సిద్ధం



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరి దేవి



దేవరాపల్లి ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

దేవరాపల్లి: గ్రామస్తుల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరి దేవి తీర్థ, కల్యాణ మహోత్సవాలు ఆఖరి రోజు ఆదివారం దేవరాపల్లిలో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమైన తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేస్తున్నారు. ఆలయానికి వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు ఎంపీపీ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి పలు వీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్

గొలుగొండ: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేసేలా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ కోరారు.

మాడుగుల రూరల్: పల్స్ పోలియో విజయవంతం చేయాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్. పుష్పమ్మ తెలిపారు. శనివారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో ఆమె సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలోని 26 బూత్‌ల్లో 2,515 మంది ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు మందు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీరికి 150 పోలియో వైల్స్ అవసరముందని, ముగ్గురు రూట్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. 104 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఆ రోజు చుక్కల మందు వేసుకోలేని వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తారన్నారు.

వైభవంగా కేశవస్వామి నాగవల్లి వసంతోత్సవం



కేశవస్వామివారి నాగవల్లి వసంతోత్సవం చేస్తున్న అర్చకులు



హోమం చేస్తున్న వేదపండితులు

చోడవరం: కేశవస్వామివారి కల్యాణోత్సవాల్లో స్వామివారికి నాగవల్లి వసంతోత్సవం కన్నుల పండువగా శనివారం జరిగింది. చోడవరంలో శ్రీదేవి భూదేవి సమేతుడైన కేశవస్వామివారి 751వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణంలో భాగంగా నాగవల్లి వసంతోత్సవంలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య స్వామివారి వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి కేశవస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచి వసంతోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, మహా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం అన్నమాచార్య పురందరదాస సంకీర్తనాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి, ట్రస్టు బోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, మాజీ చైర్మన్ ఉప్పలబాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com